# విశాల హృదయాలు

— పూలికుంట పార్థసారథి రెడ్డి

సన్నజాజుల పరిమళాలను చల్లగాలి మోసుకొచ్చి కుసుమను చుట్టేసింది. ఆ స్పర్శకు పరవశించిపోయిన కుసుమ అలాగే మల్లెపొద ప్రక్కన నిలుచుండిపోయింది.

ప్రతి దినము సాయంత్రం పూలతోటలో తిరుగుతూ, ఆనంద లోకాల అంచులను అందుకునేటందుకు ప్రయత్నిస్తూ, తీయని కలల మధ్య ఈ లోకాన్నే మరచిపోతుంది కుసుమ.

కుసుమ, రామారావుగారి ఏకైక పుత్రిక. విశాలమైన కళ్లు, అందమయిన ముక్కు, నొసలిపై సున్నితంగా నాట్యం చేస్తున్నట్లు కదిలేముంగురులు, ఎర్రని బుగ్గలు - కుసుమ అందానికి నిర్వచనాలు.

జీవితంపట్ల జీవన విధానంపట్ల ఆమెకు కొన్ని ప్రత్యేకమయిన అభిప్రాయాలున్నాయి. జీవితం అంటే జాజి పందిరిలా గుభాళించాలని, పున్నమివెన్నెలలా వుండాలని నేను కోరుకోను. జీవిగా పుట్టాక పుట్టినందుకు సార్థకమేమిటి? అని ఆలోచించి కనీసం ఒక మంచి పని అయినా చేయాలి." అనుకునేది

తండ్రి పిలవగానే ఏమిటి నాన్నా? పిలిచారు" అంటూ కుసుమ వచ్చింది.

-"ఏమిటి నాన్నా మీలో మీరే గొణుక్కుంటున్నారు?" నవ్వుతూ అడిగింది కుసుమ.

"అది .. అదేనమ్మా, నీ పెళ్లి సంగతి" అంటూ కూతురి ముఖంలోకి చూశాడు.

"ఇపుడేం తొందరొచ్చింది, నాన్నా!" మామూలుగానే అంది కుసుమ.

"అవి ప్రతిఆడపిల్ల అనేమాటలేనమ్మా! వయసులో ఏది జరగాలో అది జరిగితే ఆనందం ఆత్మ సంతృప్తి తల్లీ. నీకు తొందర లేకున్నా, మీ మామ రంగరావు గారు ఒకటే పోరు పెడుతూ ఉత్తరాలు వ్రాస్తున్నాడు. వాసుకి కూడా ఈ ఏడాదితో బి. ఎ అయిపోతుందట."

ఇంతలో కుసుమ తల్లి జానకమ్మ ప్రవేశించింది

'అవునే తల్లీ! నిన్నకూడా ఒక ఉత్తరం వ్రాశాడు ముచ్చటగా నీకు మూడు ముళ్ళు పడిన తరువాత 'గోవిందా! రామా!" అంటూ తీర్థయాత్రలకు పోవాలనుకున్నామే మేము. అయినా, వాళ్ళే తొందర చేస్తుంటే మనము నిమ్మకు నీరెత్తినట్లు వుంటే బావుంటుందా, చెప్పు?"

కుసుమ కేమి మాట్లాడాలో తెలియటం లేదు ఏకంగా తల్లిని, తండ్రిని చూడసాగింది

"అదేమిటే అలా చూస్తున్నావ్? నీకు

వాసును చిన్నప్పటి నుండి అనుకుంటున్న సంబంధమేగా?" అంటూ జానకమ్మ దీర్ఘం తీసింది.

"నాకీ సంబంధం వద్దు నాన్నగారూ!" తక్షణ జవాబుచెప్పి తన ధైర్యానికి తన్ను తానే అభినందించుకుంది కుసుమ.

జానకమ్మ, రామారావు గార్లు ఆశ్చర్య చకితులయ్యారు.

'కుసుమా! ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చావా? వాసులాంటి వాడు నీకు ఎన్ని వేలు కట్నం పోసినా దొరకదమ్మా! వాడికేం తక్కువ? చదువు, గుణము అందచందాలన్నింటి లోనూ నీ కంటే గొప్పవాడే!" అన్నాడు రంగారావు.

"అవునమ్మా! పెద్దల మాట కాదనకు, తల్లీ! మీ వాసు బావను పెళ్ళిచేసుకో!" కంట తడిపెడుతూ జానకమ్మ చెప్పింది.

"వాసు బావకి అందచందాలు, లేవని నా ఉద్దేశ్యంకాదు, నాన్నా! నేను ఇదివరకే గోపాలాన్ని ప్రేమించాను"

"ఆఁ ఆ గ్రుడ్డివాణ్ణా!" జానకమ్మ ఆశ్చర్యంతో అంది.

"అవునమ్మా! అతనిని గ్రుడ్డివానిగా పరిగణించే మీకు, విశాలమైన అతని మనస్సుకున్న అంతర్నేత్రాలు కనిపించక పోవచ్చు. తల్లి, తండ్రి, అన్న తమ్ముళ్ళు ఎవ్వరూ లేని అభాగ్యుడు, అందుకే అతని కళ్ళకు బదులుగా నేను తోడుంటే నా జన్మకు పరమార్థం లభిస్తుంది." ఆవేశంగా అంది కుసుమ

"ఛెప్పేటందుకు ఈ ఆశయాలు సులభంగా ఉంటాయి; ఆచరణలో అనుభవిస్తే గాని అందులోని కష్టనష్టాలు నీకు తెలియవమ్మా! ప్రతి తల్లి తండ్రి తమ బిడ్డ చిరకాలం సుఖంగా ఉండాలనే కోరుకుంటారు. కానీ, నిత్యం కష్టాలలో కుమిలి పోవాలిని కోరు కోడు మా మాట విను తల్లీ!" అంటూ రామారావుగారు కంటతడి పెట్టాడు.

"మీరు అనుకుంటున్న కష్టాలు, కష్టాలు కాదు నాన్నా! అవే కష్టాలయితే ఆనందంగా స్వీకరిస్తాను. ఇదినా తుది నిర్ణయం" అని. కుసుమ తన గదిలోనికి వెళ్ళిపోయింది.

గోపాల్ మధ్య తరగతి కుటుంబీకుడు. బి. ఏ. చదువుతుండగా స్ఫోటకం వచ్చి అతని రెండుకళ్ళని పొట్టన పెట్టుకుంది. అప్పటి నుండి అతను ఇంటి వద్దనే ఉంటూ, పొలాన్ని కౌలుకిచ్చి, వచ్చిన ఆదాయంతో జీవిస్తున్నాడు తీరిక సమయాలలో కుసుమ గోపాల్‌ని కలుసుకునేది. వారిద్దరూ విజ్ఞాన దాయకమైన ఎన్నో విషయాలపై చర్చిస్తూ ఉండే వారు అతని విజ్ఞానానికి అబ్బురపడ్డ కుసుమ, గోపాల్‌కు కళ్ళు లేనందుకు జాలి పడేది.

గోపాల్ పై కుసుమ కున్న అభిమానం అనురాగంగా, అనురాగం వివాహబంధంగా మారింది.

కుసుమ వివాహం గోపాల్‌తో జరిగి పోయింది. వచ్చిన బంధుమిత్రాదులు మొదట ఆశ్చర్య పడ్డా, అక్షింతలు చల్లక తప్పలేదు.

"నీ ఇష్టప్రకారమే పెళ్ళి జరిపించాము. వెయ్యేళ్ళు వర్థిల్లు తల్లీ!" అని ఆశీర్వదిస్తూ కంటతడి పెట్టారు జానకమ్మ, రామారావు గార్లు

"మీ ఆశీస్సుల బలంవల్ల, దైవకృపవల్ల నా జీవితం పచ్చగా పదికాలాలపాటు తప్పక నిలుస్తుంది" అంటూ తలితండ్రుల పాదాలకు నమస్కరించి ఆనంద బాష్పాలు రాల్చింది కుసుమ.

వాసుకూడా పెళ్ళికి వచ్చాడు. మనస్ఫూర్తిగా వధూవరులను ఆశీర్వదించాడు.

వివాహానంతరం కుసుమ వాసును పలుకరించింది. 'బావా! నిన్ను కాదన్నానని నా మీద కోపంతో పెళ్ళికి రావనుకున్నాను. కానీ నా ఆలోచన తప్పయింది. నీది విశాల

ప్రియం, బావా!"

"ఆ..ఆ పెద్ద పెద్ద మాటలతో నన్ను ఆకాశానికి ఎత్తేస్తున్నావే!"

"కుసుమా! అన్యోన్యంగా మీ దంపతుల అనురాగ బంధాల మధ్య ఆనంద డోలికలలో ఊగాలని దేవుని ప్రార్థిస్తున్నాను. నీకే సాయం కావలసి ఉన్నా నా శక్తికి తగినట్లు నిరభ్యంతరంగా చేస్తాను. నీవు ఎక్కడున్నా ఈ వాసును మరచిపోవు గదూ!" గుండెల్లో బడబాగ్నిని దాచుకుని కన్నుల్లోని అశ్రుబిందువుల తుడుచుకొని, చెప్పి వెళ్ళిపోయాడు. కుసుమ మెల్లిగా నిట్టూర్చింది.

విధికి చాలా చిన్న కళ్ళుంటాయి. అది చూసే చూపులో పచ్చని జీవితాలు సైతం భగ్గున మండిపోతాయి. అదే కుసుమ విషయంలోనూ జరిగింది. ఆ రోజు కుసుమా, గోపాల్ బస్సులో ప్రయాణం చేస్తున్నారు. తప్ప తాగిన డ్రైవరు అజాగ్రత్త మూలంగా కుసుమ, గోపాల్‌లు ప్రయాణం చేస్తున్న బస్సును లారీ ఢీకొట్టింది. బస్సు తునాతునకలైంది. అక్కడికక్కడే బస్సు, లారీ డ్రైవర్లు రక్తపు మడుగులో విలవిలలాడుతూ మరణించారు.

ఆసుపత్రిలో చేర్చబడ్డ గోపాల్, మృత్యువుతో ఒక రోజు పోరాడి చివరికి ఓడిపోయాడు. కాళ్ళను పోగొట్టుకున్న కుసుమ అవిటిది అయింది.

భర్తను, కాళ్ళను పోగొట్టుకున్న కుసుమను చూచి రామారావు, జానకమ్మగారు ఘొల్లుమన్నారు.

"చిరకాలం నిన్ను సుమంగళిగా చూడాలని కలలుగన్నామే కాని, పాదాలపై పారాణి ఆరకముందే అమంగళకరమైన వార్త వింటామనుకోలేదు తల్లీ!" అంటూ జానకమ్మ విలపించింది.

"ఆశయాలు ఆదర్శాలన్నావే! ఇపుడు ఆ ఆదర్శాలు నిన్ను ఆదుకుంటాయా?" అంటూ వాపోయారు రామారావు.

కుసుమ దుఃఖాన్ని గమనించిన వాసుకు ఏడుపు ఆగలేదు. తల్లిదండ్రులను, వాసును ఓదార్చాలనే కుసుమ ప్రయత్నం విఫలమై తాను కూడా కన్నీరు కార్చక తప్పలేదు.

"గుడ్డివాణ్ణి చేసుకోవద్దని చెప్పినా విన్నావుగదే! ఆ భగవంతుడు నిన్నిలా అవిటిదాన్ని చేస్తాడని తెలిసి ఉన్నా [illegible]!" అన్న జానకమ్మ మాటలకు వాసు, "అత్తయ్యా!" అని అరిచాడు. ఆ అరుపుకు ముగ్గురూ తెల్లబోయారు.

"అత్తయ్యా! కుసుమ ఆదర్శాల్ని, మంచి మనసును మీరు అర్థం చేసుకోలేక పోతున్నారు. ఆమె మనసు మీకు తెలిసి ఉంటే ఇలా మాట్లాడేవారు కారు."

"కుసుమ ఆదర్శాలు, ఆమె మంచి మనసు మాకు తెలుసు, వాసూ! కానీ ఇప్పుడు రక్షించలేవుగా" అంటూ రామారావు వాసు ముఖంలోకి చూశాడు.

"తప్పకుండా రక్షిస్తాను మామయ్యా! మీరు "ఊ" అంటే నేను కుసుమను మనసారా స్వీకరిస్తాను" అన్న వాసు మాటలకు అందరు విస్తుపోయారు.

కుసుమ ఆశ్చర్యపోతూ "వద్దు బావా! నేను నీకు తగను" అంటూ కన్నీరు పెట్టుకుంది.

"కుసుమా! ఇందులో నా స్వార్థం లేకపోలేదు. నీ జీవిత సౌభాగ్యం కోసం గోపాల్‌ని పరిణయమాడావు. నేను నా జీవిత పరమార్థం కోసం నిన్ను స్వీకరిస్తున్నాను. కాదనకు" అంటూ కుసుమ చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"నీది విశాల హృదయం బావా!" అన్న మాటలు కుసుమ నోటి నుండి అప్రయత్నంగా వెలువడ్డాయి.